గాలిచెట్టు

గాలి సెట్టుకాడి కెత్తకపోయే గంప సిద్ధమైందా?" అప్పుడే పెరట్లో నుంచి ముఖం కడుక్కొని తలగుడ్డతో ముఖం తుడుచుకుంటూ వస్తున్న కొడుకును ప్రశ్నించాడు అరవయ్యేళ్ళ మునయ్య.

"ఆఁ అయినట్టే."

"సీనప్పను రమ్మని సెప్పినావా?"

"ఆఁ . చెప్పేసినా. కానీ, వాళ్ళింకా రాలా!"

సమాధానం చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయాడు మునయ్య కొడుకు ముప్ఫయ్యేళ్ళ మునిరత్నం.

ఆ ఇంటిల్లిపాదీ ఆ ఇంట్లో చిన్న పిల్లలకు పుట్టెంటికలు తీయడానికి చేస్తున్న మునిదేవరోత్సాహంలో మునిగి ఉన్నారు.

మునిదేవరకు వచ్చే బంధువులందరూ అప్పటికే వచ్చేశారు. రెండు రోజుల ముందుగానే ఆ గూడ మిద్దె గోడలకు పెచ్చులు పూడ్చి, సున్నం కొట్టి, గడపలకు, అరుగులకు ఎర్ర మన్ను పట్టెలు తీశారు. ఆ రోజు ఉదయానికంతా ఇంటిని కడిగి పేడతో అలికి, ఇంటి ముందర కల్లాపి చల్లి పిండి ముగ్గులు వేసి, ద్వారబంధాలకు మామిడి తోరణాలు కట్టి అలంకరించారు. ఆ వేళ ఆ ఇల్లు తాజాదనంతో, ఒంటినిండా అలంకరించుకొని పేరంటానికి తయారైన పల్లె పడుచు మాదిరి కళకళలాడుతోంది.

ఇంటి ముందర కాస్తా పెరటివైపునకు, నీడ కోసం టెంకాయ కీతుల్తో పందిరి వేశారు. ఆ పందిరి కింద వేసి ఉన్న చాపల పైన కూర్చొని వచ్చిన బంధువులు పిచ్చాపాటీ మాట్లాడుకుంటుంటే, ఆడవాళ్ళు ఇంటి పనుల్లో మునిగి ఉన్నారు.

పెరట్లో రెండు నీళ్ళ తొట్లున్నాయి. వాటి కవతల ఎత్తుగా పెరిగిన రెండు బొప్పాయి చెట్లు రామలక్ష్మణుల్లా ముచ్చటగా కనిపిస్తున్నాయి. ఆ రెండింటిలో ఒక చెట్టు నిండుగా పూత వేసి ఉంటే, మరో చెట్టు నిండా కాయలు కాసి ఉంది. కాయలు కాసి ఉన్న చెట్టుకు ఓ నల్లటి మేకపోతు - కారు పిల్ల - కట్టివేయబడి ఉంది. ఆ చెట్లకవతలున్న మల్లె పందిరి నీడలో కూర్చొని నాలుగో క్లాసు చదువుతున్న మునిరత్నం కొడుకు మునిరాజు, మునిలక్ష్మి కూతురు అయిదేండ్ల చిన్న బిడ్డ అచ్చనకాయలాడుకుంటున్నారు.

ఇంటి ముందర కూర్చొని వాళ్ళనే మురిపెంగా చూస్తోన్న మునిలక్ష్మి "వీళ్ళిద్దరికీ ఇట్టే పెండ్లయిపోతే ఎంత బాగుండునో. ఓపినంతాస్తి. దానికంతటికీ ఏకైక వారసుడు మునిరాజిగోడే. ఈ ఆస్తినంతా ఊరోళ్ళెందుకనుభవించాల. తింటే నా బిడ్డే తినాల" అనుకుంది.

అయిదేండ్లప్పుడు పెండ్లయి, చిన్న బిడ్డ పుట్టిన సంవత్సరానికంతా, టు అడ్రస్ లేకుండా వేసిన చోటుకే తిరిగొచ్చేసిన పోస్టు లెటర్‌లాగా పుట్టింటి కొచ్చేసిన ఆ ఇంటి ఏకైక ఆడపడుచు మునిలక్ష్మి.

"ఏమమ్మాణ్ణీ, ఇంట్లో అన్నీ సిద్ధమేనా?" ఇంట్లో నుంచి పందిరికిందికి వచ్చిన మునిరత్నం చెల్లెల్ని అడిగాడు.

"అన్నీ సిద్ధమే అన్నా ... వదినా నువ్వూ రెడీగావల్ల. అంతే" అంది మునిలక్ష్మి.

"ఏమయ్యా మునిసుందరయ్యా, మీ వంగిశంలో అందరికీ పేరు ముందర ముని ముని అంటా పెట్టుకుంటారెందుకు?" పందిరి కింద కూర్చోనున్న మునయ్య అన్న ముని సుందరయ్యను మరో బంధువు అడిగాడు.

"ఎందుకేముండాదబ్బా. మాకు ముందేవరుండాదిగదా. అట్ట ముందేవరుండే వోళ్ళంతా మునీస్పుడి పేరొచ్చేట్టిగా బిడ్డలకు పేర్లు పెట్టుకోవాల. ముందేవరజేసి, వోళ్ళకు పుట్టెంటికలు దీయాల." వివరించాడు మునిసుందరయ్య.

"ఓహో! అందుకేనా మునిరత్నం, ముని సుబ్బరమణ్యం, ముని రాజు, మునిలచ్చిమి, మునెంగటప్ప అంటా పేర్లు బెట్టుకున్నారూ" అంటూ తల పంకించాడా బంధువు.

"సరే ఉండబ్బా! మళ్ళా వస్తా" అంటూ పెరట్లోకి లేచొచ్చాడు మునిసుందరయ్య.

"ఏం పెదనాయనా, కూసోకుండా ఇట్టొస్తివి?" పెరట్లో నిలబడి ఉన్న మునిరత్నం అడిగాడు.

"యాడబ్బా! పది గంటలుగాలా. అప్పుడే పందిరికింద ఉక్కబోస్తా ఉంది" అంటూ బొప్పాయి చెట్లను పరిశీలిస్తూ ... కాయలు కాయని చెట్టును చూసి "ఔరా రత్నా, ఈ పరింది చెట్టు కాయలు గాయదా ఏమీ" అన్నాడు.

"ఏమో, కాయలు కాయలేదు పెదనాయనా. పూత సూడు యెట్టుండాదో. సచ్చినోడి కండ్లు చారడనీ, తీగెలు తీగెలుగా జానెడు పొడవుతో" అన్నాడు మునిరత్నం.

"అయితే, అది మగసెట్టబ్బా!"

"మగసెట్టా. అయితే ఏంజేయాల?"

"చేసేదేముండాదీ? వొగ కొడవలెత్తుకోని అట్ట కాయలు గాయని మగ సెట్టును బూతులు తిడతా, కాయలు కాస్తావా నరికేస్తునా, కాస్తావా నరికేస్తునా అంటా మూడుసార్లు అని, మూడుచోట్ల గాట్లు పెడితే, ఆ భయానికి చెట్టు కాయలు కాస్తుందంటారు."

"అట్టనా. అయితే, మచ్చు క్రొడవలిస్తాగానీ, ఆ పనేదో నువ్వే సెయ్యి పెద్ద నాయనా. ఆడికీ కాయలు కాయకపోతే ఆ తర్వాత నరికేస్తా. కాయలు కాయకపోతే ఇంటెనకెందుకు దండగ." ఇంట్లోకి వెళ్ళి ఓ మచ్చుకత్తి తీసుకొచ్చి ఇచ్చాడు మునిరత్నం.

దాన్ని తీసుకొని ముని సుందరయ్య చెట్టు దగ్గరకు వెళ్ళాడు. వెళ్ళి కొడవలి పైకెత్తి "రుడపాతిక (ఎందుకూ పనికిరాక రుణం తీర్చుకోవడానికే పుట్టినది) చెట్టా. కాయలు కాయవంటనే నీయబ్బడాలా? కొజ్జాముండా. ఈసారి గనక కాయలు కాయకపోయినావో... నిన్ను నిలువునా నరికేస్తా. కాస్తావా? నరికేస్తునా? కాస్తావా? నరికేస్తునా? కాస్తావా? నరికేస్తునా!" అంటూ మూడుసార్లు నరికినట్టు నటించి చెట్టుపైన మూడు గాట్లు పెట్టాడు ముని సుందరయ్య. కన్నీరు కారుస్తున్నట్లుగా

గాట్లు పడినచోట చెట్టు నుంచి తెల్లటి పరింది పాలు బొట్లు బొట్లుగా కారసాగాయి.

ఆ దృశ్యాన్ని చూసిన మునిలక్ష్మి మనసులో దేవురించినట్లయింది.

"ఏం లోకమిది? మొగోడు సంతానానికి పనికిరాడు అని తెలిసినా రెండో పెండ్లి చేసుకోడానికైనా సిద్ధపడతారు. ఆడదానికి బిడ్డలు పుట్టకపోతే మాత్రం గొడ్డుదానా, గొడ్డుబోతుముండా అంటా నానారకాలుగా ఆడిపోసుకుంటారు పనికిరాని వస్తువు మాదిరి సూస్తారు. ఈ మాదిరిగానే మొగోడికి బిడ్డల్ని కనే శక్తిలేకపోతే నరికేస్తా, నరికేస్తానంటా బెదిరించగూడదా! ఆడికీ ఫలితం లేకపోతే ఆ చెట్టుకు లాగానే నిలువునా నరికెయ్యరాదా? మడిసికో న్యాయమూ, మగ సెట్టకో న్యాయమా? మగాడికో న్యాయం, ఆడదానికో న్యాయమా?" పరిపరి విధాలా ఆలోచించసాగింది.

❖ ❖ ❖ ❖

నిజానికి అందరి ఆడపిల్లల్లాగానే పుట్టింట్లో అల్లారుముద్దుగానే పెరిగింది మునిలక్ష్మి. మంచీ చెడూ గ్రహించలేని వయసులో ఇంటర్ పాసవగానే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది మనువు. ఒకడే కొడుకు పైగా, మున్సిపల్ ఆఫీసులో అకౌంటెంట్. ఆ పైన నదురుగా వుండాడు. ఉద్యోగస్థులే కాదు, స్కూల్‌ఫైనల్ గట్టెక్కిన కుర్రాడే లేని ఆ పల్లెకి ఉద్యోగస్థుడైన అల్లుణ్ణి తెచ్చుకోవడం ఘనకార్యంగానే భావించాడు మునయ్య. ఆ ఊర్లోకంతా కాస్త స్థితిమంతుడనిపించుకున్న మునయ్య ముప్పయ్ వేలు కట్నం పోసి, అన్ని లాంఛనాలతో ఘనంగానే అత్తగారింటికి పంపించాడు మునిలక్ష్మిని.

అత్తగారింట్లో మునిలక్ష్మి కాపురం రెండేండ్లు సజావుగానే సాగింది. కానీ, మునిలక్ష్మి కడుపు మాత్రం పండలేదు. ఎన్నో నోములు నోచింది. ఎందరి దేవుళ్ళకో మొక్కుకుంది. అయినా, ఫలితం లేకపోయింది. దాంతో "ఈ గొడ్డు ముండను కట్టుకోబట్టే కదా ముంగిట్లో చిన్న పిల్లలు దోగాడంది" అంటూ సాధించడం మొదలు పెట్టింది అత్త.

'ఈ గొడ్డుబోతుని కొడుక్కి కట్టబెట్టబట్టికదా నా వంశం నిర్వంశం అయిపోయేట్టుగా ఉండాది. నా వంశం ఈడితో కడయిపోయేట్టుగా ఉండాదే" అంటూ అంగలార్చసాగాడు మామ.

దానికి తోడు కట్నం తక్కువిచ్చారనీ, పిల్లలు పుట్టని ఆమెను ఎలాగో ఓలాగు పుట్టింటికి పంపేసి, కొడుక్కి మరో పెండ్లి చేయాలనీ, అందుకోసం ప్రయత్నాలు ప్రారంభించారు ఆమె అత్తమామలు. తల్లితండ్రుల మాట జవదాటని ఆమె భర్త వెంకటమునీ వాళ్ళతో కలసిపోయాడు. మునిలక్ష్మి ఆ విషయం తల్లితండ్రులకు చెప్పుకొని వాపోయింది కూతురి బాధ చూసి మునయ్య ఎలాగో అల్లుణ్ణి ఒప్పించి, ఇద్దర్నీ పట్నం తీసుకువచ్చి పేరుగాంచిన డాక్టర్ల దగ్గర చూపించాడు. డాక్టర్లు ఇద్దర్నీ పరీక్షించి ఎన్నో టెస్టులు చేయించారు. మునిలక్ష్మికి ఏ లోపం లేదనీ, పైగా ఫెర్టిలిటీ కూడా చక్కగా ఉందనీ చెప్పారు. ఎటొచ్చీ, ఆమె భర్త వెంకటముని సెమన్‌లో వీర్య

కణాల సంఖ్య చాలా తక్కువనీ, ఉన్న అవైనా చాలా నిర్వీర్యంగా ఉన్నాయనీ డాక్టర్లు తేల్చి చెప్పేశారు. అతనికి జీవకణాల కౌంటింగ్ పెరిగి, ఆరోగ్యకరమైన వీర్యకణాలు రావడానికి ఏవో కొన్ని టానిక్కులు, మందులు రాసిచ్చి వాడమన్నారు. అప్పటికీ ప్రయోజనం లేకపోతే ఇక అంతే అన్నారు. దాంతో వెంకటముని ఖంగుతిన్నాడు. ఈ విషయం ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు.

ఎలాగైతేనేం చివరికి ఆమె కలలు, నోచిన నోములు ఫలించాయి. ఆమె కడుపు పండింది. ఆడబిడ్డ పుట్టింది. మునిలక్ష్మికి సంతానం లేనిలోటు తీరిపోయి గొడ్రాలన్న అపవాదు తొలగిపోయింది గానీ, మరో కొత్త సమస్య తలెత్తింది. వంశాన్నుద్ధరించే మగపిల్లవాణ్ణి కనకుండా ఎవరితోనో పడుకొని బిడ్డను పుట్టించుకుందని అత్తమామలు కొడుక్కి నూరిపోశారు. ఇంకేముంది. అగ్గికి ఆజ్యం పోసినట్లయింది. అత్తమామల్తోపాటు మగడు రాచిరంపాన పెట్టసాగాడు. అతనూ స్వార్థానికి బానిసైపోయాడు. వాళ్ళ అనుమానమే పెనుభూతమైపోయి ఆమె జీవితాన్ని కబళించివేయసాగింది. అందరూ కలసి మునిలక్ష్మిని ఈ పొయ్యిలో పెట్టి, ఆ పొయ్యిలో తీయసాగారు. మునిలక్ష్మి వాళ్ళు పెట్టే బాధలు భరించలేక 'ఈ మొగుడు లేకపోతే ఏం? ఇట్టాంటి మొగుడు లేకపోయినా బాగుండు. నాకు ఈ పీడ ఎప్పుడు విరగడౌతుందో, ఈ నరకం నుంచి తనెప్పుడు బయటపడతానో' అని ఎదురు చూడసాగింది. ఆమె అలా అనుకున్న కొద్దిరోజులకే నానా తిట్లుతిట్టి, తన్ని తగలేసి పుట్టింటికి పంపేశారు.

ఆ తర్వాత వెంకటమునికి అతని తల్లితండ్రులు పెళ్ళి ప్రయత్నాలు సాగించారు. ఎలాగైనా సరే కొడుక్కి మారు మనువు చేసి తిరిగి ఎక్కువ కట్నం పొందాలని చూశారు. కానీ, వాళ్ళ ప్రయత్నం ఫలించలేదు. గుణవతి, సంస్కారవతి అయిన మునిలక్ష్మినే, అదీ ఒక బిడ్డ పుట్టింతర్వాత తన్ని తరిమేశారనీ, అలాంటిది ఏ ఆడకూతుర్నిచ్చినా అలాగే చేస్తారనీ ఆడపిల్లల తల్లితండ్రులు భావించారు. చూసి చూసీ తమ కూతుర్ని బలిపెట్టడానికి ఎవ్వరూ ఇచ్చగించలేదు. వాళ్ళ ప్రయత్నాలు ప్రయత్నాలుగానే మిగిలిపోయాయి.

రోజులు గడిచిపోతూనే ఉన్నాయి. ఇల్లు చేరిన ఆడబిడ్డను చూసి మునయ్య ఏమీ బాధపడలేదు. తన అనంతరం ఎట్లో, ఏమో అనుకొని ఆమె రక్షణార్థం కొంత ఆస్తిని ఆమె పేరుతో రాసిపెట్టేశాడు. ఈ నేపథ్యంలో మునిలక్ష్మి పట్టుబట్టి టైప్‌రైటింగ్ కూడా నేర్చుకుంది. మునయ్య ఎన్నో తంటాలు పడి పంచాయతీ ఆఫీసులో టైపిస్టుగా ఉద్యోగం కూడా సంపాయించి పెట్టాడు. ఆ తర్వాత నిశ్చింతగా గాలి పీల్చుకున్నాడు.

తన కాళ్ళపైన తాను నిలబడింది మునిలక్ష్మి. పంచాయతీ సమితి ఆ పల్లెకి కిలోమీటరు దూరంలో ఉండడంతో రోజూ ఆఫీసుకి పోయి వస్తోంది. కూతుర్ని కూడా అక్కడే కాన్వెంట్‌లో చేర్పించి చదివించసాగింది.

ఈ విషయం తెలుసుకున్న వెంకటమునికి ఆమె జీతంపైనా, బిడ్డ పేరుతో, భార్య పేరుతో ఉన్న ఆస్తుల పైనా ప్రేమ ఎక్కువ కాసాగింది.

తాను తప్పు చేశాననీ, ఈసారి ఏ లోటూ లేకుండా మునిలక్ష్మిని చూసుకుంటాననీ రాయబారాలు మొదలెట్టాడు. ఎలాగైనా సరే ఆమెను తిరిగి ఇంటికి రప్పించుకొని, ఆమె ద్వారా వచ్చే ఆదాయాన్ని పొందాలని శతవిధాలా ప్రయత్నించాడు. కానీ, మునిలక్ష్మి దేనికీ స్పందించలేదు. తిరిగి సంసారాన్ని దిద్దుకునే అవకాశం వచ్చింది. ఒప్పుకోమని ఆమె తల్లితండ్రులు ఒత్తిడి తెచ్చారు. అన్నా వదినలు, అయినోళ్ళు, అమ్మలక్కలు ఎందరో చెప్పి చూశారు. కానీ, మునిలక్ష్మి చలించలేదు. ససేమిరా ఒప్పుకోనంది. అయినా, వెంకటముని తన ప్రయత్నాలు మానలేదు.

❖ ❖ ❖ ❖

"ఇంక లెయ్యండమ్మా. గంపలెత్తుకోని గాలి సెట్టు కాడికి పోవాల" అన్న మునిరత్నం పిలుపుతో ఇహంలోకొచ్చింది మునిలక్ష్మి.

గతం గుర్తుకువచ్చి చెమ్మగిల్లిన కళ్ళను పైటతో తుడుచుకుంటూ ఇంట్లోకడుగు పెట్టింది. అక్కడ నట్టింట దీగూట్లో నూనె దీపం నిశ్చలంగా వెలుగుతోంది. దాని కింద, నేలపైన ఆవు పంచితంతో అలికిన గంప, అందులో సగం వరకు బియ్యం, కూరకు కావాల్సిన మసాలా దినుసుల పొట్లం, రెండు కొబ్బరి కాయలు, పూలు, మొగలిరేకులు, పసుపు, కుంకుమ, అగరొత్తులు, కర్పూరం, విభూతి ఉండలు వంటి పూజాద్రవ్యాలు, ఒక వేట కొడవలి పెట్టి ఉన్నాయి.

మునిరత్నం కొబ్బరికాయ కొట్టి, కర్పూరం వెలిగించి, 'సామితల్లీ ... మునీస్పుడా. మా పిల్లల్ని కలకాలం నువ్వే సల్లంగ కాపాడకరావల్ల. వాళ్ళ సంతు వెయ్యి సంతులు గావాల. వాళ్ళకు సకలము గలిగీ సంతోషించాల' అంటూ మనసులోనే మొక్కుకుని హారతి పట్టాడు. ఇంట్లో వాళ్ళందరూ హారతి కళ్ళకద్దుకున్నారు.

మునిసుందరయ్య వీధిలోకి వెళ్ళి, "వొరే మునిదేవరోళ్ళు వస్తావుండారు. దూరంగా పోండి. మల్లేదన్నా సెబ్బర జరిగితే నింద మామింద పెట్టొద్దండి" అంటూ గట్టిగా కేకేశాడు.

శీనప్ప మెడకు డోలు తగిలించుకుని మోస్తూ డుబ్‌డుబ్‌మంటూ డోలు కొడుతుంటే, అతని కొడుకు కొండయ్య తు తూ... తు తూ అంటూ మేళం వాయించసాగాడు. ఆ శబ్దం విన్న వీధిలోని జనం దూరంగా తప్పుకున్నారు. మునిరత్నం గంపనెత్తుకుని ముందు బయలుదేరాడు. అతని వెనుక మేకపోతును పట్టుకొని మునయ్య, అతని వెంట పిల్లల్ని వెంటబెట్టుకొని ఆ ఇంటిల్లిపాదీ బయలుదేరారు. వాళ్ళ వెంట బంధువులు నడవసాగారు. మంగళ వాద్యాలు ముందు, వాళ్ళ వెంట వీళ్ళు.

కొద్ది క్షణాల్లోనే వాళ్ళు ఊరికుత్తరానుండే వాళ్ళ మామిడి తోటకు చేరుకున్నారు.

అది వసంత ఋతువు కావడంతో చిగుళ్ళు వేసి, పూతపూసిన మామిడి చెట్లతో, చింత

చెట్లతో అక్కడ వాతావరణం చల్లగా ఉంది. ఉండి ఉండి కుహూ... కుహూ అంటూ కూసే కోకిలల గానం, ఆ చెట్ల నుంచి వీస్తు కమ్మటి గాలి.

ఆ తోటలో ఈశాన్య మూలనున్న వ్యవసాయపు బావి, దాని గట్టున రకరకాల చెట్లు చేమలు గుబురుగా ఉన్నాయి. ఆ బావి గడ్డకు కొంత దూరంలో తోట మధ్యన ఓ పెద్ద ఊడగచెట్టు ఎత్తుగా, పొడవుగా కనిపిస్తోంది. ఆ చెట్టు కాండంతో కలిసిపోయి మరో మామిడి చెట్టు, మర్రి చెట్టు నీడన పెరగలేక పెరిగిన తుప్పచెట్టులా పీలగా కనిపిస్తోంది. ఆ చెట్టు మొదట్లో మూరెడెత్తున్న పుట్ట. ఆ పుట్టకోమలకానించి జానెడెత్తుతో శివలింగం మాదిరున్న ఓ నల్లరాయి. అదే మునిదేవర. ఆ చెట్టే గాలి చెట్టు.

ఆ గాలి చెట్టుకు కొంత దూరంలో ఉన్న ఓ పెద్ద మామిడి చెట్టు కింద గంపదించాడు మునిరత్నం. వచ్చిన వాళ్ళందరూ ఆ చెట్టు కిందనే కూర్చున్నారు. అక్కడే ఓ కంప చెట్టుకు మేకపిల్లను కట్టేశాడు మునయ్య. ముని సుందరయ్య, మునిరత్నం రంగంలోకి దిగారు. ఆ చెట్టు చుట్టూ, ఆ పుట్ట ముందరా పెరిగిన గడ్డీ గాదం పారతో చెక్కేసి, నీళ్ళు చల్లి, చదరం చేశారు. జయమ్మ పేడతో పుట్ట ముందర అలికితే, మునిలక్ష్మి ముగ్గులు పెట్టింది.

మగాళ్ళిద్దరూ కలిసి ఆ రాయిని నీళ్ళతో కడిగి, పసుపు అద్దిన గంధంతో తుడిచారు. మునీశ్వరుడు మహాశివుడి వీరభద్రావతారంగా భావించే కోపిష్టి దేవత కాబట్టి, పూసిన గంధం ఆరిన తర్వాత ఆ శిలకు విభూతి రేఖలు దిద్ది, మధ్యన త్రినేత్రంలా గంధం బొట్లు పెట్టారు. రకరకాల పూలతోను, మొగలి రేకులతోను శిలను అలంకరించారు. ఆ తోటలోనే ఓ మూల పెరిగి ఉన్న మారేడు చెట్టు నుంచి కొన్ని మారేడు ఆకుల్ని కోసి తెచ్చి ఆ శిలపైన పెట్టారు.

ఇంకోవైపున మామిడి చెట్టు కింద ఆడవాళ్ళు మూడు రాళ్ళు పొందించి అప్పుడే వంట ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇంకో ఇద్దరు ఆడవాళ్ళు తోట మధ్యలో ఉన్న బండమీధ తెల్లగడ్డలు, గసాలు, చెక్క, లవంగాలు కొబ్బరి వంటి మసాలా దినుసులు వేసి కారం నూరసాగారు. కొందరు పిల్లలు మరో మామిడి చెట్టు కొమ్మకు చేంతాళ్ళు కట్టి ఉయ్యాలలు ఊగుతున్నారు. ఆ వేళ వాళ్ళు వన విహారానికి విచ్చేసినట్లు సందడిగా, సంతోషంగా, ఉత్సాహంగా ఉన్నారు.

యజ్ఞకుండం దగ్గర యూపస్తంభానికి కట్టివేయబడి ఉన్న యజ్ఞ పశువులా మేకపిల్ల అమాయకంగా కంప చెట్టు చిగుళ్ళను ఆబగా కొరికి మేయసాగింది.

"ఏమన్నో శీనన్నో ... మీరు కానీ ... " అంటూ కేకేశాడు మునిరత్నం. శీనప్ప కూర్చున్నవాడు కూర్చున్నట్లే డోలు ముందరుంచుకొని డోలు కొడుతూనే, మరో వైపున నోటితో మేళం కూడా ఊదసాగాడు. కొండయ్య పిర్ర కింద రాయి వేసుకొని కూర్చొని, గిన్నెలో నీళ్ళు పోయించుకొని పాదిని తెరచి కత్తి నూరుతూ, "ఇంక రాండన్నో" అంటూ పిలిచాడు. మగవాళ్ళు ఒకరొకరే వెళ్ళి కొండయ్య ముందర కూర్చొని గెడ్డాలు గీయించుకోసాగారు. చివరన మునిరాజును, చిన్న బిడ్డను కూర్చోబెట్టి శుభ్రంగా గుండు గీయించేశారు. కొండయ్య అడపం పెట్టెను మూసేసి తండ్రి చేతిలో

నుంచి మేళం అందుకొని ఊదసాగాడు.

గొరిగేసిన పిల్లల జుట్టులో నుంచి కొన్ని వెంట్రుకలు తీసుకొచ్చి కానులు జతచేసి పుట్టకోమలో వదిలేశాడు మునయ్య. బావిలో నుంచి తెచ్చిన నీళ్ళతో పిల్లలిద్దరికీ స్నానాలు చేయించి కొత్త బట్టలు వేసి దేవుడి ముందర కూర్చోబెట్టి, కొబ్బరి కాయలు కొట్టి హారతిచ్చారు. అందరూ లేచివచ్చి హారతి కళ్ళకద్దుకున్నారు.

మునిలక్ష్మి కూడా హారతి కళ్ళకద్దుకొని "నా సంసారం బాగుండుంటే, ఆయనే ఈ ముందేవర చేయించాల్సినోడు" అనుకుంది. ఆమె మనసులో అలా అనుకుందో లేదో, సరిగ్గా అప్పుడే అక్కడ ప్రత్యక్షమయ్యాడు ఆమె భర్త వెంకటముని.

భార్యను పుట్టింటికి పంపేసిన నాలుగేళ్ళ తర్వాత కనిపిస్తున్నందుకు మనసులో నొచ్చుకున్నా, మునయ్య, మునిరత్నం ముభావంగానే పలుకరించారు.

నానా హింసలు పెట్టి, ఇన్నేండ్లు వదిలేసినందుకు ఉక్రోషంతో మునిలక్ష్మి మౌనంగానే ఉండిపోయింది. కూతుర్ని దగ్గరికి పిలిచి ఎత్తుకొని ముద్దాడడానికి ప్రయత్నించాడతను. కానీ, చిన్న బిడ్డ అతన్నుంచి తప్పించుకొని వచ్చేసింది. అతని వాలకం చూసిన మునిలక్ష్మికి ఆశ్చర్యం వేసింది.

"ఒకప్పుడు ఇది ఎవడికో పుట్టిందని నిందలేసి పుట్టింటికి తరిమేసి, ఇప్పుడు మళ్ళా తగుదునమ్మాంటూ బిడ్డను ఎత్తుకొని ముద్దాడేదానికి సిగ్గులేదు. ఏమ్మొగోళ్ళో ఏమో" అనుకుంది.

కూతురు తన దగ్గరకు రానందుకు వెంకటముని మనసు చివుక్కుమంది. ఆ తర్వాత మేకపోతును తీసుకొచ్చి, గాలిచెట్టు చుట్టూ మూడు చుట్లు తిప్పి పుట్టకెదురుగా నిలబెట్టారు. కొండయ్య వేటకొడవలి తీసుకొని పైకెత్తి, 'కిళికిల్లో' అంటూ ఓ కేక వేసి ఒకే వేటుకు దాని తలను నరికేశాడు. చివ్వున చిమ్మిన దాని రక్తం వేలితో అద్ది, పిల్లల నొసటన బొట్టు పెట్టాడు మునయ్య. ఆ తర్వాత మేకపోతు శరీరాన్ని చెట్టుకొమ్మకు తలకిందులుగా వేలాడదీసి, దాని చర్మం ఒలిచి, శరీరాన్ని ముక్కలు ముక్కలుగా కోసి, వండి వచ్చిన వాళ్ళకంతా వడ్డించి ఆరగించేశారు. అందరూ హాయిగా భోంచేసి, ఆ మామిడి చెట్టుకిందనే కూర్చున్నారు. కమ్మటి సువాసనల్ని మోసుకొస్తూ ఓ గాలి తెమ్మెర వాళ్ళను సుతారంగా స్పృశించి వెళ్ళిపోయింది. ఓ మూల నుంచి కూస్తున్న కోకిల గొంతు కమ్మగా వినిపిస్తోంది. వెంకటముని చాలా రోజుల తర్వాత సుష్టుగా భోంచేసి, మౌనంగా కూర్చోనున్నాడు. తాను వచ్చిన విషయం ఎలా ప్రస్తావించాలో తెలియక అతని మనసు మల్లగుల్లాలు పడసాగింది. సరిగ్గా అప్పుడే అతని సమస్యను గమనించినట్లు, "ఏమబ్బా వెంకటమునీ, ఇన్ని దినాలకు భార్యాబిడ్డలు గుర్తుకొచ్చినారా" అంటూ పలుకరించాడు ఓ బంధువు.

ఏదో జరిగిపోయింది సినాయనా. సంసారమన్నాక ఎన్నో వస్తావుంటాయి, పోతావుంటాయి. అబ్బుటికీ నాదేం తప్పులే. అయినా, మళ్ళీ తీసుకుపోదామనే వస్తి" అన్నాడు వెంకటముని. 'తన్ని తరిమేసి తిరిగి తానేమీ చేయలేదని, తప్పంతా నాదేనన్నట్లు మాట్లాడేదానికి అయప్పకు

నోరెట్లా వస్తావుంది' అనుకుని మధనపడసాగింది మునిలక్ష్మి.

"ఆఁ ఏమీలే. ఈ బిడ్డకుద్యోగమొచ్చె. వరుంబడి పెరిగె. పైగా అయమ్మ పేరుతో ఆస్తుండె. బిడ్డ పేరుతో దుడ్డుండిపాయ. వాటికోసరం వచ్చిండాడులే."

"అంతే అయ్యుంటుంది. లేకుంటే ఇప్పటికి గుర్తుకొచ్చినారా పెండ్లాంబిడ్డలు?" వెనక కూర్చోనున్న ఇద్దరు గుసగుసలాడారు.

"ఉన్నన్ని దినాలూ బంగారట్ల బిడ్డెను రాసిరంపాన పెట్టి తరిమేసిందిగాక, ఇంకా నన్ను సూడు సినాయనాంట ఊగులాడించుకుంటా వచ్చినాడబ్బా బిడ్డను తీసుకపోయేదానికి."

"వాడి మొగం సూడు వొట్టి అంబేద మొగం. రుణపాతిక కొడుకు." మరో పెద్దాయనా వాళ్ళతో గుసగుసలాడుతూనే రుసరుసలాడాడు.

ఆ మాటలు అరకొరగా అతని చెవుల్లో పడుతున్నా వినబడనట్లే ప్రవర్తించాడు వెంకటముని. తినిపారేసిన మెతుకులకోసం, ఎముకల కోసం ఎంగిలాకుల్ని ఆశ్రయించిన కుక్కలు రెండు కాట్లాడుకుంటుంటే, కొన్ని కాకులు కావుకావుమంటూ అరవసాగాయి.

"ఏమ్మబ్బోడా! ఇంతకూ నువ్వేమంటాండావు?" ప్రశ్నించాడు ముని సుందరయ్య.

"ఏమండ్లా మామా, నా పెండ్లాం బిడ్డల్ని తీసుకపోతా అంటావుండా." చెప్పాడు వెంకటముని.

"ఇప్పుడు ఇన్ని దినాల తర్వాత మళ్ళా తీసుకపొయ్యి, అయమ్మను సక్రమంగా చూస్తావని గ్యారంటీ ఏముండదబ్బా నీదగ్గర?" మధ్యలో కల్పించుకుంటూ అడిగాడు మునయ్య.

"లేదు మామా. అప్పుడేదో పొరబాటైపోయింది. ఇంగమీదట అట్ల జరగదు. మీ బిడ్డను పువ్వుల్లో పెట్టుకోని సూసుకుంటా" భరోసాగా అన్నాడు వెంకటముని.

"ఏమోబ్బా! నీ స ంసారం బాగుసేసుకుంటా నంటే ... మేమేమనేదానికుండాది. కానీ వొగమాట?"

"ఏంది?"

"కన్నోళ్ళకు బిడ్డేమీ భారంగాదు. ఆ మాటగ్యేఁవనానికి పెట్టుకో"

"మీరంతగా సెప్పాల్నా ... మీకేం భయంలేదు. ఈసారి బాగానే సూసుకుంటా. నాతో పంపించెయ్యండి మామా."

"పంపించేదానికి మేమెవ్వురబ్బా. కనిచ్చేసినాము. ఇచ్చేసినాంక అది మీ సొత్తు. వస్తే తీసకపో."

"అట్లగాదు మామా నువ్వు సెప్పు" అర్థించాడు వెంకటముని. అతని నక్కవినయాల్ని చూసి ఆశ్చర్యపోయింది మునిలక్ష్మి. అందరూ మౌనంగా వాళ్ళ సంభాషణ వినసాగారు.

"ఏమమ్మా! ఇంటివిగదా! పోతావా?" అన్నాడు కూతుర్ని చూసి మునయ్య. మౌనంగా ఉండిపోయింది మునిలక్ష్మి.

"ఆయసెప్పె దిగొచ్చి అడిగినాంకా, నువ్వు పంతానికి పోవద్దు బిడ్డా. నీ జీవితం బాగుపరుచుకోతల్లీ" అంది మునిలక్ష్మి తల్లి ఆదెమ్మ.

"అవునమ్మా వచ్చిన అవకాశం వదులుకోవద్దు" అన్నారు అన్నావదినెలు.

"బాగా యోచ్చన జేసి సెప్పమ్మా" అన్నాడు సుందరయ్య.

"ఏంది పెద్దనాయనా సెప్పేది. ఆడికి పొయ్యి అత్తామామల హింస నేను భరించలేను. ఇబ్బుడేమో ఇట్టే అంటాడు. ఆ తర్వాత ఈ ముండమొగుడి దగ్గిర దినమ్మూ పిడిగుద్దులు తినలేను. లంజాలవకా అంటా గబ్బు కూతలు వినలేను." కచ్చితంగా చెప్పేసింది మునిలక్ష్మి.

"అదిగాదమ్మా ... నీ సంసారం ..." ఇంకా ఏదో చెప్పబోయాడు.

"వద్దు పెద్దనాయనా చెప్పొద్దు. ఆయప్ప ఎందుకొచ్చిండేదీ నాకు బాగా తెలుసు. మన దేవుడి సత్తెం మనకు తెలీకుండా ఉంటుందా? నామింద, నా బిడ్డమింద మమకారం పుట్టుకొచ్చి కాదు ఆయప్పొచ్చిండేది. ఇంక నా సంసారం మంటావా? 'మేము కలిసుండాము, మామద్దెన ఏ పొరపొచ్చాలూ లేవు' అంటా లోకాన్ని నమ్మించేకోసరం వచ్చిండాడాయప్ప. అంతే మనసు విరిచేసిన ఈ మొగోనికి, ఆయన్ను కన్నోళ్ళకీ జీవితాంతం ఊడిగం చెయ్యలేను. ఆ ఉత్తుత్తి సంసారం నాకొద్దు. నేతిబీరకాయలో నెయ్యి లేనట్లే, అట్టాంటి సంసారంలో సుఖముండదు. లోకం మెప్పుకోసరం మనసు సంపుకోని నేను నటించలేను." కొట్టినట్టు చెప్పేసింది మునిలక్ష్మి. ఆ మాటతో, ఆ పైన ఆమెకెవ్వరూ ఏమీ చెప్పలేకపోయారు.

"ఇదే నీ నిర్ణయమైతే, నా బిడ్డన్నాకిచ్చెయ్యి. నేనే సాక్కుంటా" అన్నాడు వెంకటముని. ఆ మాటతో తోకతొక్కిన త్రాచులా కస్సున పైకి లేచింది ఆమె.

"నీ బిడ్డ! ఇన్ని దినాలకొచ్చి ఇది నా బిడ్డ అంటే యట్టయితాది?" ధైర్యంగా నిలదీసి అడిగింది.

"నాకు పుట్టింది నా బిడ్డ గాదా! దాని పైన నాకు హక్కూ, అధికారం లేదా?" అతనూ ఆవేశపడిపోతూనే అడిగాడు. అందరూ మౌనంగా వింటూనే ఉన్నారు.

"ఆయప్ప సెప్పేది గూడా కొంచెం నాయమే గదమ్మా." సర్ది చెప్పడానికి ప్రయత్నించాడు మునిసుందరయ్య.

"యెట్ల పెద్దనాయనా నువ్వు సెప్పేది?" ప్రశ్నించింది.

"తల్లికే గాకుండా, పుట్టించినోడికి అధోటీ, హక్కు బిడ్డపైన ఉంటాయి గదమ్మా."

"ఆ .. అట్ట గడ్డి పెట్టు ..." వెటకారంగా అన్నాడు వెంకటముని.

దాంతో ఇంకా రెచ్చిపోయింది మునిలక్ష్మి. అన్ని రోజుల్నుంచీ తనలో దాచుకున్న అక్కసంతా ఆమె గుండెలోనుంచి గొంతులోకి తన్నుకొచ్చేసింది.

"అంతేలే పెదనాయనా. మీరంతా మొగోళ్ళే గాబట్టి అట్టంటారు. వొగతూరి నా స్థానంలోకి వచ్చి మాట్లాడండి తెలస్తాది. పుట్టించినోడికి అధోటీ, హక్కు ఉండదా అంటివి గదా. సూడు

పెదనాయనా! ఈ గాలి సెట్టునే సూడు. గాలి సెట్టంటే ఏంది? అసలు ఈ ఊడగ సెట్టు గాలి సెట్టు ఎట్టయింది?

పచ్చులు నానా రకాల పండ్లు, కాయలు తినేసి యాడంటే ఆడ రెట్ట వేస్తాయి. రెట్టతో పాటు తిన్న పండ్లను, కాయల్ను అరాయించుకొని, గింజల్ని మాత్రం అట్టే వదిలేస్తాయి. ఆ గింజలు పడింసోటనే ఎండకు ఎండి, వానొచ్చినప్పుడు నాని మొలకెత్తతాయి. ఆ మొలకే పెరిగి పెద్ద మానవతాది. అట్ట గాలికి పెరిగిన సెట్టునేగదా గాలి సెట్టు అంటా పిలస్తాం. ఆ గాలి సెట్టు తనవల్లనే పుట్టినా, ఆ పచ్చికి ఎట్ట అధికార ముంటుంది దానిపైన? దాన్ని తన గర్భంలో దాచుకోని మొలకెత్తించి పెద్దదవడానికి కారణమైన భూమమ్మకేగదా దాని పైన అధికారం ఉంటుంది. అట్ట గాదంటే, ఆ భూమి యజమానికి గదా అధికారం, హక్కు ఉంటాయి. అంతేగానీ, పుట్టించిన ఆ పచ్చికి కాదుకదా! ఈ ఊడగ సెట్టుగూడా అంతే. ఇది ఏ కాకో ఏసిన రెట్ట నుంచి మా తోటలో పడి గాలికి మొలకెత్తింది, గాలికి పెరిగింది, గాలికి పెద్దదై గాలి సెట్టయింది. అంతమాత్రాన ఇది ఆ పచ్చిదా ... మా నాయన్దా? నా బిడ్డ విషయంలో గూడా అంతే. నా బిడ్డ ఈ గాలి సెట్టు మాదిరి నా ఒడిలో పెరిగింది. పెద్దదయింది. పుట్టించినోడు ఆయప్పే అయినా, దానికి రక్తమాంసాలిచ్చి నవమాసాలు మోసి కనిపెంచింది నేను. అయినా, ఆయప్ప ఏనాడన్నా దాని ఆలనా పాలనా చూసినాడా. లేదే! దాని మంచీ సెబ్బరా పట్టించుకున్నాడా? లేదే! కాబట్టి నా బిడ్డపైన నాకే హక్కుండాది. అధికారముండాది. అడిగేదానికి ఆయప్పకు అథోటీ లేదు. అంతే!" ఆవేశంతో ఊగిపోతూ చెప్పింది మునిలక్ష్మి.

ఆమె ఆవేశానికీ, వాక్ప్రవాహానికీ అక్కడి జనం కొట్టుకుపోయారు. అందులో ముద్దగా తడిసిపోయారు. ఆ ప్రవాహంలో వెంకటమునీ కొట్టుకుపోక తప్పలేదు.

ఎప్పుడూ అమాయకం, మౌనంగా కనిపించే మునిలక్ష్మిలో ఇంతటి దృఢ నిర్ణయం, ధైర్యం, తెగువ ఎలా దాగి ఉన్నాయో తెలియక ఆశ్చర్యంలో తేలిపోయారు వాళ్ళు. కొన్నింటిని జీవితమే నేర్పిస్తుందన్న నిజాన్ని తెలుసుకోవడం వాళ్ళకు ఎంతోసేపు పట్టలేదు. ఇక లాభం లేదనుకుని లేచి అవమాన భారంతో మెల్లగా అక్కడి నుంచి వచ్చేశాడు వెంకటముని. అందరూ అతను వెళ్ళినవైపే చూడసాగారు.

కానీ, మునిలక్ష్మి మాత్రం గాలికి పుట్టి, గాలికి పెరిగి గాలి చెట్టుగా పిలిచే ఆ ఊడగ చెట్టునే చూస్తుండిపోయింది. ఆవేళ ఆమెకు ఆ చెట్టు ఇంకా ఎత్తుగా ఎదిగిపోయినట్టు, నిర్మలంగా, నిటారుగా, ఎంతో గొప్పగా అనిపించింది.

● *5, మే 1998, ఇండియాటుడే* ●